

వామ్మో వానరం

గ్రామాల్లో కోతుల గుంపులు బెంబేలె త్తిస్తున్నాయి. ఇళ్లు, పంటలపై దాడులు చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. 8లో▸



తాగునీటి సమస్య..

పరిగి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. 8లో▸



సొంత భవనాలేవి?

దౌల్తాబాద్ మండలంలో మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు కరువయ్యాయి. 9లో▸

న్యూస్‌రీల్

కర సేవకుని అంత్యక్రియల్లో ఎంపీ కొండా



వైద్యనాథ్ అంతిమయాత్రలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ధారూరు: కర సేవకుడు, బీజేపీ సీనియర్ నాయకుడు పత్తి వైద్యనాథ్ శనివారం ఉదయం మృతిచెందారు. మధ్యాహ్నం మండలంలోని అంపల్లి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సీనియర్ నాయకుడు పాండుగౌడ్, మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ సర్పంచ్ బాబయ్య, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, ఎం.రమేశ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరును మరిచే ప్రసక్తే లేదు

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: ఎవరెన్ని కుట్రలు చేసినా తనకు రాజకీయ జన్మనిచ్చిన తాండూరును మరిచే ప్రసక్తే లేదని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దస్తగిరిపేట్‌లో అకాల మరణం పొందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ భగవాన్ కరీం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పరిమళ, మాజీ సర్పంచ్ శేఖర్, నాయకులు బోయరాజు, సలీం, రాజశేఖర్, రఘు, భగవాన్, పుణీత్‌కుమార్, అయూబ్‌ఖాన్, శివానంద్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను పటిష్టం చేద్దాం

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

అనంతగిరి: విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో పీఆర్‌టీయూ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లలు మంజూరయ్యేలా ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. స్కావేంజర్ల సమస్యలను సాధ్యమైనంత తర్వగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పలుగం దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై రోజుకో మాట

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ రోజుకో మాట మాట్లాడుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. శనివారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకసారి బిల్లు ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తామని, మరోసారి పార్టీ పరంగా అమలు చేస్తామని ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, పార్టీపట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, నాయకులు రాజేందర్ గౌడ్, మల్లేశం, గయాజ్, లక్ష్మయ్య, సురేష్‌గౌడ్, దత్తు, అశోక్, మల్లికార్జున్, శివకుమార్, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకి సై

- ప్రాథమిక పాఠశాల నుంచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యకు కసరత్తు
- కొడంగల్ నియోజకవర్గంలోని 112 స్కూళ్లకు 265 కంప్యూటర్ల పంపిణీ
- సీఎం ఇలాకాలో విద్యకు ప్రాధాన్యత



పాఠశాలలకు కంప్యూటర్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కొడంగల్: నియోజకవర్గంలో ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యకు అడుగులు పడుతున్నాయి. కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లోని 112 ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ బోధనకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా 265 కంప్యూటర్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. 30 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో ఏఐ బోధన ప్రారంభించనున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. గతంలో ఉన్నత పాఠశాలల్లో ఈ తరహా బోధన అమలు చేశామని తెలిపారు. ఒక్కో స్కూల్‌కి ఐదు చొప్పున కంప్యూటర్లు అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు వచ్చాయన్నారు. వీటిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో కంప్యూటర్ పరిజ్ఞానం అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

పేదలకు చేరువలో విద్య, వైద్యం

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్య, వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారా మెడికల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, వెటర్నరీ కాలేజీ, కొత్త మండలమైన దుద్యాల్ తోపాటు దౌల్తాబాద్, బొంరాస్‌పేట్‌కు జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు. కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్, బీసీ సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాలు మంజూరు చేశారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేశారు.

ఉన్నతమైన ఆశయానికి అండగా..

పేద విద్యార్థులకు ఉదయం పూట బలవర్ధకమైన అల్పాహారం అందించాలనే ఉన్నతమైన ఆశయం వెనుక ఐదుగురి కృషి ఉంది. అందులో మొదటి వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. సీఎం చొరవతోనే ఈ పథకానికి రూపకల్పన చేశారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, వయాట్రీస్ సంస్థ సీఎస్‌ఆర్ నిధుల ఇండియా హెడ్ మిచెల్ డొమినికా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్, తెలంగాణ సోషల్ ఇంఫాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ సహకారం ఉంది. పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్మించిన కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్‌లో ఆహారాన్ని వండేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. వంట కోసం ఉపయోగించే నీటిని ఆర్‌ఓ ప్లాంట్‌లో శుద్ధి చేస్తారు. బాయిలర్ ప్లాంట్, గ్యాస్ బ్యాంక్, ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వండిన ఆహారం వేడిగా, పరిశుభ్రంగా ఉండడానికి తగిన చర్యలు తీసుకున్నారు.

బ్రేక్ ఫాస్ట్ మెనూ ఇలా..

సోమవారం	-	ఇడ్లీ, సాంబారు
మంగళవారం	-	పూరీ, ఆలూ కుర్మా
బుధవారం	-	ఉప్మా, సాంబార్
గురువారం	-	మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
శుక్రవారం	-	ఉగ్గాని/పొంగల్, చట్నీ
శనివారం	-	బోండా, చట్నీ



నిర్మాణంలో ఉన్న 220 పడకల ఆస్పత్రి

28వేల మందికి అల్పాహారం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28వేల మంది విద్యార్థులకు రోజూ ఉదయం పూట అల్పాహారం అందిస్తున్నారు. ఈ బాధ్యతను హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ తీసుకుంది. ఇందుకోసం కొడంగల్ పట్టణంలో కేంద్రీ కృత కమ్యూనిటీ కిచెన్ షెడ్‌ను నిర్మించారు. నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ హెల్తీ న్యూట్రీషన్ బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

చెంచుల సంక్షేమానికి కృషి

- అనంతగిరిపల్లి చెంచు కాలనీలో మల్టీ పర్పస్ సెంటర్
- రూ.60 లక్షలతో భవన నిర్మాణం
- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: చెంచుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి చెంచు కాలనీలో ప్రధానమంత్రి జన్మాన్ పథకం కింద నిర్మించనున్న మల్టీ పర్పస్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెంచు కాలనీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ.60 లక్షల వ్యయంతో మల్టీ పర్పస్ సెంటర్ భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మైపాల్ రెడ్డి, షరీఫ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, సీనియర్ నాయకులు ఎండీ. హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



మల్టీ పర్పస్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఆ సినిమాను ఆదరించాలి

అనంతగిరి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకుని ఆయన జీవిత చరిత్రను తెరపైకి తీసుకువస్తున్న సినిమాను అందరూ ఆదరించాలని డైరెక్టర్ సేనాపతి, నిర్మాణ కమిటీ చైర్మన్ దేశానాయక్ కోరారు. శనివారం వికారాబాద్‌లో నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సహ నిర్మాత తార్యానాయక్, దేశనాయ క్, నరసింహనాయక్, రవినాయక్, బలరాం నాయక్, తిరుపతి, రత్నయ్య పాల్గొన్నారు.



సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీం సభ్యులు



మాట్లాడుతున్న బోధ మయానంద మహరాజ్

యువతను సేవ వైపు మళ్లించాలి

- రామకృష్ణ మఠం అధ్యక్షుడు బోధ మయానంద మహరాజ్

తాండూరు టౌన్: యువతను సామాజిక సేవా తత్పరత వైపు మళ్లించేందుకు శ్రీ రామకృష్ణ సేవా సమితి కృషి చేయాలని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీ పూజ స్వామి బోధ మయానంద మహారాజ్ అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ రాష్ట్ర అర్ధ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 18 సేవా సమితులు, 71 మంది ప్రతినిధుల భక్త బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు బానిసలుగా కాకుండా వారిని సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక జీనవం వైపు మళ్లించాలన్నారు. వారిలో ఏకాగ్రతను పెంపొందించి, మానసిక ఒత్తిళ్ల నుంచి దూరం చేయాలన్నారు. సేవా సమితి అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని, రామకృష్ణ మఠం ద్వారా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడటం, అనేక అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీ రామకృష్ణ ప్రభ అనే ఆధ్యాత్మిక విశ్వాస మాస పత్రిక, బాలల మాస పత్రిక 'మొలక'ను స్వామీజీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ భావ ప్రచార పరిషత్ అధ్యక్షుడు స్వామి పూజనానంద మహరాజ్, వేదానంద మహరాజ్, తాండూరు సమితి సభ్యులు సూర్యప్రకాష్, బాలకృష్ణ, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం

- కల్తీ కల్లు విక్రయాలను నిరోధించాలి
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- వికారాబాద్‌లో శాఖ కార్యాలయం ప్రారంభం



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

వికారాబాద్: డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రం వికారాబాద్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నూతన కార్యాలయ భవనాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ఇవి ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయో నిఘా పెట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైతే ఇతర రాష్ట్రాల సహకారం తీసుకోవాలన్నారు.

ఈత, తాటి, కర్జూర చెట్లు పెంచాలి

రాష్ట్ర వ్యాప్తంగా చెరువు కట్టల మీద, గుట్టలపైన, కాల్వల పక్కన ఈత, తాటి, కర్జూర వంటి మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల మేర స్థలంలో వీటిని నాటేలా చూడాలన్నారు. నగరానికి సమీపంలో ఉన్న వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు సీరా, కల్లు ఎగుమతి చేసే విషయంపై దృష్టి సారించాలని తెలిపారు. కల్లు దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ కల్తీ కల్లు విక్రయాన్ని అడ్డుకోవాలని ఆదేశించారు. ఇందుకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కల్తీ కల్లు, మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపా లని మహేందర్‌రెడ్డి, పల్లెలను పాడు చేస్తున్న డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఎంపీ కొండా అన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ విజయభాస్కర్, అదనపు కలెక్టర్ సుధీర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ,ఎక్సైజ్ శాఖ సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భోజనం బాగోలేదని ఆందోళన



పాఠశాల ఆవరణలో బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

- మర్పల్లి కేజీబీవీలో విద్యార్థినుల నిరసన
- ఇది సిబ్బంది పనేనన్న ప్రిన్సిపాల్
- నాణ్యమైన భోజనం అందిస్తున్నామని వెల్లడి

మర్పల్లి: మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని, నాణ్యత కూడా పాటించడం లేదంటూ మర్పల్లి కేజీబీవీ విద్యార్థినులు శనివారం ఆందోళనకు దిగా రు. ఉదయం పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులు వచ్చారు. పాఠశాలలో భోజనం సరిగ్గా లేదని, తిన లేకపోతున్నామని బాలికలు కుటుంబ సభ్యుల దృష్టికి తెచ్చారు. ఆగ్రహించిన వారు పిల్లలతో కలిసి పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ.. భోజనంలో తరచూ పురుగులు వస్తున్నాయ ని తెలిపారు. ఒక్క రోజు కూడా మెనూ అమలు కావడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా పిల్లలను నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విధులు నిర్వహించే కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థి నులను రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని తెలిపారు. రోజూ ఒక టీచర్ నైట్ డ్యూటీ చేయాల్సి ఉంటుందని, ఇది కచ్చితంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇది నచ్చని ఓ ఉపాధ్యాయురాలు తోటి సిబ్బంది, విద్యార్థులను రెచ్చగొట్టి ఇలా గొడవలు చేయిస్తోందని తెలిపారు. సదరు టీచర్‌కు రాజకీయ పలుకుబడి ఉండటంతో నైట్ డ్యూటీ చేయడం లేదని పేర్కొన్నారు. విద్యార్థినుల భోజన విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు వివరించారు.

'రియల్' మబ్బులు..!

- మూడేళ్లుగా ఆగిన భూముల క్రయవిక్రయాలు
- అగ్రిమెంట్ల వద్దే నిలిచిన కొనుగోళ్ల ప్రక్రియ
- రోజురోజుకూ పడిపోతున్న రిజిస్ట్రేషన్లు
- ఆందోళనలో వ్యాపారులు, రైతులు



మోమిన్‌పేటలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్

మోమిన్‌పేట: మూడేళ్లుగా రియల్ వ్యాపారం డీలా పడింది. గతంలో మూడుపూలు ఆరుకాయలుగా విరాజిల్లిన ఈ దందా ప్రస్తుతం నెమ్మదించింది. పలువురు వ్యాపారులు అప్పులు చేసి భూములు కొనుగోలు చేశారు. మరి కొందరు అగ్రిమెంట్ల చేసుకొని మిన్నకుండి పోయారు. గతంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రోజుకు 40కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఒక్కో రోజు స్లాట్ దొరికే పరిస్థితి కూడా ఉండేది కాదు. ప్రస్తుతం రోజుకు పది కూడా దాటడం లేదు. అవి కూడా రెండు మూడు కుంటలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నాలుగైదు ఏళ్ల క్రితం వరకు ఎకరం భూమి రూ.లక్షల్లో పలికేది. మూడేళ్ల నుంచి రూ.కోట్లకు చేరుకుంది. అయినా రియల్ వ్యాపారం బాగుండటంతో కొంత మంది వ్యాపారులు అప్పులు చేసి సిండికెట్‌గా ఏర్పడి భూములు కొనుగోలు చేశారు. రెండేళ్ల నుంచి రియల్ దందా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక.. వ్యాపారం సాగక ఏం చేయాలో తెలియక హైరానా పడుతున్నారు. అగ్రిమెంట్ల వద్దే ప్రక్రియ నిలిచిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. సాధారణంగా అగ్రిమెంట్ చేసుకుంటే నిర్ణీత గడువులోగా డబ్బు చెల్లించి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. లేకుండా డబ్బు పోయే అవకాశం ఉంటుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుంటుందనే ఆశతో చాలా మంది అగ్రిమెంట్ చేసుకొని భూ యజమానులకు రూ.లక్షలు అడ్వాన్స్ రూపంలో చెల్లించారు. ప్రస్తుతం రియల్ వ్యాపారం లేకపోవడంతో మిగిలిన డబ్బు చెల్లించి భూమి కొంటే నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. గతంలో మండలంలో రియల్ భూం అందనంత ఎత్తుకు వెళ్లింది. పెట్టిన పెట్టుబడికి మూడు నుంచి నాలుగు వందల రెట్ల లాభాలు వచ్చాయి. నాలుగేళ్ల క్రితం ఎన్కతల గ్రామంలో 852 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ కంపెనీ కోసం ప్రభుత్వం భూమిని సేకరించింది. దీంతో ఈ ప్రాంత భూములకు రెక్కలు వచ్చాయి.

111 జీఓ ఎత్తివేయడంతో..

మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 111 జీఓను ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించడంతో రియల్ దందా ఒక్కసారిగా కుదేలైంది. వెంచర్లు ఏర్పాటు చేసిన చాలా గ్రామాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. అప్పట్లో మండలంలోని ఏ గ్రామంలోనైనా రోడ్డు పక్కన ఎకరా రూ.కోటిపైనే పలికింది. మోమిన్‌పేట - శంకర్‌పల్లి రోడ్డు పక్క ఎకరం రూ.4 కోట్ల పైమాటే. ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రియల్ దందా పుంజుకుంటుందని చాలా మంది వ్యాపారులు భావించారు. కానీ వారి ఆశలు ఫలించలేదు. మూడేళ్ల క్రితం ఎన్కతలలో ప్రభుత్వం భూమిని సేకరించింది. దీన్ని టీజీ ఐఐసీ రూ.45 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. రెండు నెలల నుంచి మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రియల్ భూం తిరిగి ఊపందుకుంటుందని వ్యాపారులు, రైతులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

87 కిలోల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ సీజ్

ఆటో డ్రైవర్‌పై కేసు

తాండూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టు డబ్బాలను కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం మండల పరిధిలోని గౌతపూర్ చెక్‌పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన సజ్జతుల్లా ఖాన్ తన ఆటోలో 87 కిలోల అల్లంవెల్లుల్లి పేస్ట్ డబ్బాలు తీసుకెళ్తున్నాడు. చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అల్లంవెల్లుల్లి పేస్ట్‌కు సంబంధించి డ్రైవర్ ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో కల్తీగా భావించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. అల్లం వెల్లుల్లి శాంపిల్స్ ల్యాబ్ పంపిస్తామన్నారు.

ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా కమిటీ నియామకం


అనురాధ


రాఘవేంద్రచారి

షాద్‌నగర్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీటీఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా నందిగామ మండలం నర్సప్పగూడ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న అనురాధను, ప్రధాన కార్యదర్శిగా ఫరూఖ్‌నగర్ ఉర్దూమీడియం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దార్ల రాఘవేంద్రాచారిని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ తెలిపారు.

డెలివరీ బాయ్‌పై దాడి కేసులో ఇద్దరి రిమాండ్


దాడికి పాల్పడిన నిందితులు


అత్తాపూర్: డెలివరీ బాయ్‌పై దాడి కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం .. సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రేహాన్ (20) పీవీఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 208 సమీపంలో జీప్టో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సులేమాన్ (25), యూనస్ (25)ను తోడుగా తీసుకువచ్చాడు. ఫుడ్ డెలివరీ చేసేందుకు ఆర్డర్లు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో మరో వ్యక్తిని ఎందుకు తీసుకువచ్చావు అని రేహాన్ సులేను ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మరో ఇద్దరు స్నేహితులు ఇమ్రాన్ (25) సలీం (22) పిలిచాడు. నలుగురు కలిసి రేహాన్‌పై దాడి చేయడంతో పాటు పదునైన కత్తితో ఎడమ చేయి, ఎడమ కాలుపై గాయాలు చేసి పారిపోయారు. రేహాన్‌ను చికిత్స కోసం ఉస్మానియాకు తరలించారు. రేహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పీఎస్‌లను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

గచ్చిబౌలి: ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ట్రైనీ ఐపీఎస్‌లు పోలీస్ స్టేషన్లను శనివారం సందర్శించారు. గచ్చిబౌలి, రాయదుర్గం పీఎస్‌లో నలుగురు చొప్పున ట్రైనీ ఐపీఎస్‌లకు రిసెప్షన్, రికార్డులు, లాకప్, సీసీ కెమెరాల పరిశీలన ఎలా ఉంటుందో ఎస్‌హెచ్‌ఓలు వారికి వివరించారు. డయల్ 100 తో పాటు పీఎస్‌లకు ఫోన్లలో ఎలా ఫిర్యాదు చేస్తారు, పెట్రోల్ మొబైల్ సిబ్బంది ఎలా స్పందిస్తారు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, హోంగార్డు, కానిస్టేబుల్ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు వారు నిర్వహించే విధులను క్షుణ్ణంగా వివరించారు.

వామ్మో వానరం

అటవీ ప్రాంతాల్లోని కోతులు జనారణ్యంలో సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పాలకులు పట్టించుకోక పోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు.


దోమ బాలికల పాఠశాల భవనంపై వానరాల గుంపు

గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు

- ఇళ్లు, దుకాణాలు, పంటపొలాల ధ్వంసం
- ఇబ్బంది పడుతున్న జనం
- పట్టించుకోని పాలకులు

దోమ: గ్రామాల్లో కోతుల గుంపులు బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లు, దుకాణాలు, పంటలపై దాడులు చేస్తూ బీభీత్సం సృష్టిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు అనుబంధ గ్రామాలు ఉదన్‌రావుపల్లి, పాలేపల్లి, లింగన్‌పల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్న క్రమంలో వెంట పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. రహదారులపై సంచరిస్తూ వాహనదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చిన్నారుల దగ్గర తినుబండారాలు కనిపిస్తే వాటిని ఎత్తుకెళ్లేవరకు వదలడం లేదు. ఇళ్లలోకి చొరబడి నిత్యావసర సరుకులను చిందరవందర చేస్తున్నాయి. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలిపిన పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం సర్వేకు ఆదేశాలిచ్చినా అధికారులు కోతులను తరలించడంలో నిర్లక్ష్యం వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కాపలా తప్పనిసరి

కోతుల బెడద వల్ల పనులు వదులుకుని కుటుంబానికి ఒకరు ఇళ్ల వద్దే కాపలా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపై బండరాళ్లు, గూన పెంకలు ధ్వం చేసి ఇళ్లలోకి చొరబడి తినుబండారాలు, కిరాణా దుకాణాల నుంచి చిరుతిళ్ల డబ్బాలు, పండ్ల వ్యాపారుల ఫలాలు ఎత్తుకెళ్తున్నాయి. పంట చేలను పాడు చేస్తూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

వంట సామగ్రి ఎత్తుకెళ్తున్నాయి



కోతుల బెడద కారణంగా ఇంటి నుంచి ఎక్కడకు వెళ్లడం లేదు. ఇంట్లో ఎవరూ లేకుంటే పెంకలు, బండలు ధ్వంసం చేస్తున్నాయి. వంట సామగ్రి ఎత్తుకెళ్తున్నాయి. ఇంట్లోకి వచ్చిన కోతులను తరిమేందుకు యత్నిస్తే ఎదురుతిరుగుతున్నాయి. తమ కిరాణ దుకాణంలో తినుబండారాల డబ్బాలు ఎత్తుకెళ్తున్నాయి.

– వెంకటమ్మ, దోమ

విద్యార్థులకు ఇబ్బంది



పాఠశాలకు వచ్చే విద్యార్థులు దారిపొడువునా వానరాలే ఉండడంతో పాఠశాలకు వచ్చేందుకు ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో గుంపులుగా వచ్చి భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఉపాధ్యాయులు సైతం ఆందోళన చెందుతున్నారు. అధికారులు కోతులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీవిద్య, హెచ్‌ఎం, దోమ జెడ్పీహెచ్‌ఎస్

తప్పిపోయిన తల్లీపిల్లల ఆచూకీ లభ్యం

కేశంపేట: కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ విషయమై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేశంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అదృశ్యమైన దీపికతో పాటు సంయ్‌కుమార్, కీర్తన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న టూటౌన్ ఠాణాకు వెళ్లారు. అక్కడ పోలీసులు దీపిక భర్త శివలింగంకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించారు.


మహబూబ్‌నగర్ టూటౌన్‌లో దీపిక పిల్లలు

చిత్రకారులను కళాకారులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిత్ర కళాకారుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

ఆమనగల్లు: చిత్రకారులను కళాకారులుగా గుర్తించాలని చిత్ర కళాకారుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపం వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో చిత్రకారులకు చేతినిండా పని ఉండేదని.. ప్రస్తుతం పనిలేక జీవనోపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో చిత్రకారులు చురుకుగా పాల్గొన్నారని, కేసులకు భయపడకుండా ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న బోర్డులను చెరిపి తెలంగాణ పదం చేర్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రకారుల బాధలను గుర్తించి న్యాయం చేయాలని కోరా రు. ఈ సమావేశంలో చిత్రకారులు కొండల్, లింగంగౌడ్, గోపి, యాదయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

గోశాలకు సాగు భూములెందుకు?

- బీడు భూములు ఇవ్వండి
- ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయండి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి


సాగుచేసిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

మొయినాబాద్: గోశాల ఏర్పాటుకు రైతులు సాగు చేసుకుంటున్న భూములెందుకు ఇస్తున్నారు.. బీడులుగా మారిన ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయి.. వాటిని ఇవ్వండని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రైతులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం ఆయన పాల్గొన్నారు. పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎనికేపల్లి 180 సర్వే నంబర్‌లోని 99.14 ఎకరాల భూముల్లో 30 ఎకరాలను 1954లోనే ప్రభుత్వం రైతులకు అసైన్డ్ చేసిందని అన్నారు. మిగతా భూమిని సైతం విడతలవారీగా అసైన్డ్ చేయగా కొంత ప్రభుత్వ భూమిగా ఉందన్నారు. మొత్తం భూమిని రైతులు సుమారు 80 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారని.. వర్షాధార పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి పేద రైతుల భూములను గోశాలకోసం లాక్కోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఎకరాకు 300 గజాల ఇంటి స్థలం పరిహారంగా ఇస్తామని చెబుతోందని.. 80 ఏళ్ల క్రితం 50 కుటుంబాలుగా ఉన్న రైతులు నాలుగు తరాలు గడవడంతో ఇప్పుడు 500 కుటుంబాలకు పెరిగాయన్నారు. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిహారం ఇవ్వాలని సూచించారు. ఈ విషయమై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, పద్మనాభం, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తాం

షాబాద్: విద్యార్థుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవింద్‌నాయక్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు రాకేశ్ డిమాండ్ చేశారు. సదరు హెచ్‌ఎం శుక్రవారం ఆరో తరగతి విద్యార్థి రాకేశ్‌ను కొట్టాడని తెలుసుకున్న ఆయన స్కూల్‌కు వెళ్లి అడగగా.. నన్ను అడిగేందుకు నువ్వెవరు..? నా స్కూల్ నాఇష్టం అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడారన్నారు. ఆయన వ్యవహారంపై కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

పహాడీషరీఫ్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంబికా, సుధాకర్(45) దంపతులు 17 ఏళ్ల క్రితం జల్‌పల్లి శ్రీరామ కాలనీకి బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. తాగుడుకు బానిసైన సుధాకర్ మూడు నెలలుగా భార్యను వేధిస్తుండడంతో ఆమె పిల్లలతో కలిసి స్థానికంగా ఉండే తన తల్లిగారింటికి వెళ్లింది. ఐదు రోజులుగా పనికి రాకపోవడంతో శనివారం ఉదయం తెలుసుకుందామని తోటి కార్మికుడు దేవిదాస్ చూసేందుకు వెళ్లడంతో సుధాకర్ ఇంట్లోని కిటికీ గ్రిల్స్‌కు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే అతడు సుధాకర్ భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సుధాకర్ శుక్రవారం రాత్రి కూడా బాగా తాగి కనిపించాడని, తాగుడుకు బానిసై మానసికంగా స్థితి సరిగ్గా లేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె పోలీసు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం

చల్లా నర్సింహా రెడ్డి

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. పట్టా పాసు బుక్ కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.6 వేల చొప్పున పంట పెట్టుబడి సాయం, రూ. 2లక్షలలోపు రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు రూ.500 గ్యాస్ సబ్సిడీ, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలు ఒక్కరికైనా డబుల్ బెడ్రూం నిర్మాణం చేసి ఇచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఇందిరాగాంధీ పేదలకు అసైన్డ్ భూముల పంపిణీ, ఇళ్ల స్థలాల పంపిణీ చేశారని, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ బీసీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బస్తీమే సవాల్.. తెల్లారితే పరార్

- ఇదీ ముఖ్యమంత్రి తీరు
- జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- అభయహస్తం మేనిఫెస్టో అమలుకు పోస్టుకార్డు ఉద్యమం
- సోనియాగాంధీకి లేఖలు


పోస్టుకార్డును పోస్టు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కేశంపేట: 'హైడ్రా పేరుతో పేదల గుడిసెలు కూల్చేందుకు బుల్డోజర్లు వెళ్తున్నాయని, పెద్దల ఇళ్ల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే.. బస్తీమే సవాల్ అంటాడు, తెల్లారితే పరార్ అవుతాడు' అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మండలంలోని వేములనర్వలో శనివారం జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కాకునూరు గ్రామంలో స్థానిక మహిళలతో కలిసి పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలందరికీ రూ.2,500 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఒక్కో మహిళకు 18 నెలలకు సంబంధించిన రూ.45 వేలు చెల్లించాలని కోరుతూ ఢిల్లీలోని సోనియాగాంధీ అడ్రస్‌కు పోస్టు కార్డులు పంపించారు. రైతుబంధు సాయాన్ని పెంచుతామని, రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రూ.2 లక్షల కోట్ల అప్పులు తెచ్చినప్పటికీ అభివృద్ధి చేయడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఫ్రీ బస్సు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. కరువుతో విలవిల్లాడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ఆయన హయాంలో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం తొంభై శాతం పూర్తయిందని, కేవలం పది శాతం పనులను చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని మండిపడ్డారు. అమ్మ ఒడి వాహనాల్లో డీజిల్ లేక తోయాల్సిన పరిస్థితి హన్వాడలో చూశామన్నారు. తమ పాటలతో ఆకట్టుకున్న కాకునూరుకు చెందిన అక్కమ్మ, రాములమ్మ జానపద బృందాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అనురాధ పర్వాత్‌రెడ్డి, కాకునూర్ మాజీ సర్పంచ్ గంగ్ర లక్ష్మమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రమాదేవి, జంగారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కవిత

పిచ్చికుక్క స్వైర విహారం

పశువుల మందపై దాడి

- ఆవు మృత్యువాత

ధారూరు: పశువుల మందపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఓ ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని నాగసమందర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లికార్జున్‌కు చెందిన పశువులపాకలోకి ఓ పిచ్చి కుక్క వెళ్లి ఆవును కరవడంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. గ్రామంలో ఎక్కడ పశువులు కనిపించినా కుక్క వెంబడించింది. గమనించిన గ్రామస్తులు పట్టుకునేందుకు యత్నించినా దొరకలేదు.

నాగారంలో చిన్నారిపై దాడి

మండల పరిధిలోని నాగారంలో చాకలి కృష్ణయ్య కూతురుపై శుక్రవారం రాత్రి ఓ కుక్కదాడి చేసి గాయపరిచింది. దీంతో చిన్నారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి శునకాలను తరలించేందుకు అధికారులు చొర తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కుక్కకాటుతో మృత్యువాత పడిన ఆవు కళేబరం

తాగునీటి సమస్య పరిష్కరించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

పరిగి: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు పేర్కొన్నారు. శనివారం పరిగి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వారంరోజులుగా సక్రమంగా తాగునీరు అందడంలేదని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్న బోరుకు మోటర్ లేక నీటిసమస్య రోజు రోజుకు తీవ్రతరమవుతుందన్నారు. ఈ అధికారులు స్పందించి ఉన్న బోరులోనైన నూతన మోటర్‌ను ఏర్పాటు చేయించి నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మహిళకు తీవ్రగాయాలు

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొక మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గూడూరు అనుబంధ గ్రామం బండమీద గూడూరుకు చెందిన గోల్కొండ జంగయ్య(57) శనివారం ఉదయం టీవీఎస్ లూనాపై జైత్వారం గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో తన మరదలు లక్ష్మమ్మను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తగూడ సమీపంలో మద్ది లక్ష్మారెడ్డి ఫౌల్ట్రీఫాం వద్ద ఎదురుగా అతివేగంగా వస్తున్న బోర్వెల్ వాహనం లూనాను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన జంగయ్య అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

రూ.50 కోట్ల రుణ మంజూరు పత్రాల పంపిణీ

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముచ్చింతల్ శివారులో గల స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో గ్రామీణ స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ, పౌల్ట్రీ రంగాల వారికి రూ.50 కోట్ల రుణాల మంజూరు పత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు, మిల్లెట్ ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. అలాగే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేశ్ రంజన్, సీజీఎం-వన్ సుధాకర్‌రావు, హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ సర్వేష్ రంజన్, సైఫాబాద్ రీజినల్ హెడ్ సోనాలికా తదితరులు పాల్గొన్నారు.


రుణ మంజూరు పత్రాల పంపిణీలో బ్యాంక్ అధికారులు, లబ్ధిదారులు

చిరుతల కోసం అన్వేషణ

ఆనవాళ్లు లభించలేదన్న అధికారులు

పహాడీషరీఫ్: బాలాపూర్‌లోని ఆర్‌సీఐ (రీసెర్చ్ సెంటర్ ఇమారత్)లో చిరుత పులులు సంచరించాయన్న వదంతుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు శనివారం వాటి జాడ కోసం గాలించారు. ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. ఆర్సీఐలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మూడు రోజుల క్రితం చిరుత కనిపించిందంటూ అధికారులకు వెల్లడించడం, మరుసటి రోజు ఓ శునకం ఇదే ఆవరణలో మృతి చెందడంతో చిరుతలు తిరుగుతుండొచ్చని భావించారు. ముందు జాగ్రత్తలో భాగంగా ఈ ఆవరణలోనే ఉన్న డిఫెన్స్ ల్యాబోరేటరీస్ స్కూల్ ప్రిన్సిపాల్.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇదే విషయాన్ని నోటీస్ రూపంలో పంపి, పాఠశాల నుంచి బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అటు అటవీ శాఖ, ఇటు బాలాపూర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆర్సీఐ పరిసరాల్లో చిరుతల పాదముద్రల కోసం అన్వేషించారు. అలాంటి ఆనవాళ్లు ఏవీ లభించలేదని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపారు. వేరే ఏదైనా జంతువును చూసి చిరుతగా భావించి ఉండొచ్చని అటవీశాఖ అధికారులు తెలిపినట్లు తెలిసింది.



ఆర్‌సీఐ పరిసరాలు